

ఆధ్యాత్మిక గురువు దలైలామాతో స్పీకర్ ప్రసాద్‌కుమార్

సీపీఏ కాన్ఫరెన్స్‌కు అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్

వికారాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని ధర్మశాలలో జరుగుతున్న వార్షిక కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్(సీపీఏ) ఇండియా రీజియన్ జోనల్-2 కాన్ఫరెన్స్‌కు శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆధ్యాత్మిక గురువు దలైలామాను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.



కేక్ కట్ చేస్తున్న డీఎంహెచ్‌వో, మహిళా వైద్యులు

వైద్యుల సేవలు అభినందనీయం

మేడ్చల్ డీఎంహెచ్‌వో ఉమాగౌరి

మేడ్చల్, జూలై 1(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సామాజిక ఆరోగ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు, బస్తీ దవాఖానాలు, పల్లె దవాఖానాల్లో అందిస్తున్న వైద్యుల సేవల అభినందనీయమని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఉమాగౌరి తెలిపారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లోని కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో కేక్ కట్‌చేసి డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యులు శోభారాణి, సత్యవతి, శ్రీదేవి, మల్లీశ్వరీ, గీతా, చంద్రకళ, కౌశిక్, వినోద్‌లు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఏటా నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమం అమలు తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు కేంద్ర బృందాలు జిల్లాలో పర్యటించనున్నాయి. జిల్లాలో ఎంపిక చేసిన 20 గ్రామాల్లో పారిశుధ్యం, సంబంధిత పనులను వారు పరిశీలించి కేంద్రానికి నివేదించనున్నారు. మెరుగైన సేవలు అందించే పంచాయతీలను ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్ పురస్కారానికి ఎంపిక చేయనుంది.

మోమిన్‌పేట మండలం, బేకులపల్లిలో చెత్త సేకరిస్తున్న కార్మికుడు



స్వచ్ఛమేవ జయతే!

స్వచ్ఛత కార్యక్రమాలను పరిశీలించనున్న కేంద్ర బృందాలు

జిల్లాలోని ఎంపిక చేసిన 20 గ్రామాల్లో అధికారుల పర్యటన

పారిశుధ్యం, మరుగుదొడ్లు, తాగు నీరు తదితర అంశాల పరిశీలన

ప్రత్యేక యాప్‌లో ప్రజాభిప్రాయాలు నమోదు

మెరుగైన ర్యాంకులు సాధించిన పంచాయతీలకు పురస్కారాలు



మర్పల్లిలో మురుగు కాలువ శుభ్రం చేస్తున్న కార్మికులు

వికారాబాద్, జూలై 1(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో 20 మండలాలు ఉండగా, వాటి పరిధిలో 594 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2025 పథకం కింద పల్లెల్లో నిర్మించిన మరుగుదొడ్లు, వాటి నిర్వహణ, పారిశుధ్యం పనులు, సురక్షిత మంచినీటి సరఫరా తదితర కార్యక్రమాలను కేంద్ర బృందాలు పరిశీలించనున్నాయి. అలాగే వ్యర్థాల సేకరణ, బహిరంగ ప్రాంతాల్లో చెత్త నిర్వహణ, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ఇంకుడు గుంతల నిర్మాణం వాటి తీరుతెన్నులను పరిశీలించనున్నారు. ఈ బృందాల్లోని అధికారులు స్వచ్ఛ సర్వేక్షణ్ పథకం కింద చేపట్టిన పనుల నాణ్యత, నిర్వహణ తీరు పరిశీలించి ఆ పనులకు మార్కులు కేటాయిస్తారు. అధిక మార్కులు సాధించిన పంచాయతీలకు మెరుగైన ర్యాంకులు, స్వచ్ఛ సర్వేక్షణ్ పురస్కారాలను అందజేయనున్నారు.

నివేదికల ఆధారంగా ఎంపిక...

జిల్లాలో ఎంపిక చేసిన 20 గ్రామాల్లో కేంద్ర బృందాలు పర్యటించనున్నాయి. స్వచ్ఛ సర్వేక్షణ్ పథకం కింద జిల్లాలో చేపట్టిన పనుల వివరాలు, ప్రగతిపై జిల్లా అధికారులు ఇది వరకే నివేదికలు పంపించారు. ఈ నివేదికల ఆధారంగా ఎంపిక చేసిన గ్రామాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించనున్నారు. ఒక్కో గ్రామంలో 16 వరకు నివాస గృహాలను

మిగతా 6వ పేజీలో...

సమాచారం లేకుండానే తనిఖీలు



గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ కింద చేపట్టిన పనులను కేంద్ర సర్వే అధికారులు త్వరలో పరిశీలిస్తారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన గ్రామాల్లో 20 గ్రామాలను ఎంపిక చేసుకుని పరిశీలిస్తారు. ఎవరికీ ఎలాంటి ముందస్తు సమాచారం ఉండదు. క్షేత్ర స్థాయిలో కార్యక్రమాల అమలు, నిర్వహణ తీరు ఎలా ఉందనేది గుర్తించి కేంద్రానికి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తారు.

- జయసుధ, జిల్లా పంచాయతీ అధికారి, వికారాబాద్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎంహెచ్‌వో లలితా దేవి

వికారాబాద్ డీఎంహెచ్‌వోగా లలితాదేవి

వికారాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి):వికారాబాద్ జిల్లా వైద్యాధికారిగా కె.లలితాదేవి మంగళవారం విధుల్లో చేరారు. ఇక్కడ పనిచేసిన డీఎంహెచ్‌వో వెంకటరవణ ఉద్యోగ విరమణ పొందడం వల్ల ప్రజా ఆరోగ్య సంచాలకులు డాక్టర్ రవీందర్ నాయక్ హన్మకొండ జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ గా పనిచేస్తున్న డాక్టర్ లలితాదేవి వికారాబాద్ డీఎంహెచ్‌వోగా నియామకమయ్యారు. విధుల్లో చేరిన అనంతరం ఆమె మర్యాదపూర్వకంగా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్‌ను కలిశారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

బాలల భవిష్యత్‌పై బాధ్యత తప్పనిసరి

మేడ్చల్, జూలై 1(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పిల్లల ముఖాల్లో చిరునవ్వుతో పాటు బంగారు భవిష్యత్తు అందించే వరకు వారి పట్ల బాధ్యతగా వ్యవహరించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు చందన, కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆపరేషన్ ముస్కాన్-11 సమీక్షా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ బాల కార్మికులు లేని జిల్లాగా మార్చాలన్నారు. చైల్డ్ లేబర్‌ను గుర్తించి వారి వివరాలను మిషన్ వాత్సల్య పోర్టల్‌లో అప్లోడ్ చేయాలన్నారు. జవహర్‌నగర్, సూరారం ప్రాంతాలపై దృష్టిపెట్టాలన్నారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ రాజారెడ్డి, జిల్లా అధికారులు శారద, ఉమాగౌరి, విజయకుమారి, ఇంతియాజ్, తిరుమలదేవి, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సాయం అందేనా?

రాజీవ్ యువ వికాసం.. ఆలస్యం!

మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలో 24,634 లబ్ధిదారుల ఎంపిక

మొత్తం వచ్చిన దరఖాస్తులు 66,816

బ్యాంకు రుణాలు రూ.401.236 కోట్లు

ఆశగా ఎదురుచూస్తున్న నిరుద్యోగులు



దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)



మేడ్చల్, జూలై 1(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిరుద్యోగులకు ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాస పథకం అమలుపై నీలినీడలు అలుముకున్నాయి మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా 66,816 మంది నిరుద్యోగులు రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తు చేసుకోగా అధికారులు దరఖాస్తుల పరిశీలించి 24,634 మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. ఈ పథకం కింద బ్యాంక్ రుణాల మంజూరుకు నాలుగు కేటగిరీల కింద లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఇందులో మైనార్టీ లబ్ధిదారులు 2,316 మంది, క్రిస్టియన్ మైనార్టీలు 1,099 మంది, వెనుకబడిన తరగతులకు చెందిన వారు 7,799 మంది, ఈబీసీలు 5,618 మంది, ఎస్టీలు 1,594 మంది, ఎస్సీలు 6,208 మంది మొత్తం 24,634 మంది లబ్ధిదారులు ఎంపికయ్యారు. ఎంపికైన లబ్ధిదారులకు జూన్ 2 రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రొసీడింగ్స్ అందజేస్తారని ప్రభుత్వం ప్రభుత్వం

మిగతా 6వ పేజీలో...

సబ్సిడీ రూ.314 కోట్లు

రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులకు మొత్తంగా రూ.401.236 కోట్లు బ్యాంక్ రుణాలు మంజూరు చేయనున్నారు. ఇందులో రూ.86.238 కోట్లు సొమ్మను లబ్ధిదారులు తిరిగి బ్యాంకులకు చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో రూ.314.998 కోట్లు ప్రభుత్వం సబ్సిడీ కింద చెల్లించనుంది. కేటగిరీ-1 కింద 7,876 మంది, కేటగిరీ-2 కింద 6,158 మంది, కేటగిరీ-3 కింద 5,247 మంది, కేటగిరీ-4 కింద 5,353 మందికి రుణాలు అందజేయనున్నారు. కేటగిరీ-1 కింద ఎంపిక చేసిన వారికి రూ. 50 వేలు మంజూరు చేస్తారు. వీరికి వంద శాతం సబ్సిడీ వర్తిస్తుంది. కేటగిరీ-2 కింద ఎంపిక చేసిన వారికి రూ.లక్ష మంజూరు చేస్తారు. వీరికి 90 శాతం సబ్సిడీ వర్తిస్తుంది. కేటగిరీ-3 కింద ఎంపిక చేసిన రూ.2 లక్షలు రుణం అందజేస్తారు. వీరికి 80 శాతం సబ్సిడీ వర్తిస్తుంది. కేటగిరీ-4 కింద రూ.4 లక్షలు మంజూరు చేస్తారు. వీరికి 70 శాతం సబ్సిడీ వర్తిస్తుంది.

'ఉత్కర్ష అభియాన్'తో గిరిజనుల అభివృద్ధి

మోమిన్‌పేట్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): భగవాన్ బిర్సా ముండా జయంతిని పురస్కరించుకొని ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన దర్తీ అబిజన జాతీయ ఉత్కర్ష అభియాన్ పథకంతో గిరిజనుల అభివృద్ధి జరుగుతుందని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ బ్లాక్ లెవల్ అధికారి రమేశ్ అన్నారు. మంగళవారం మండలంలోని రాళ్లగూడుపల్లి గ్రామస్తులతో సమావేశం నిర్వహించి వారికి అవగాహన కల్పించారు. దీని ద్వారా ద్వారా దాదాపు 5 కోట్ల గిరిజన, ఆదివాసీలు ప్రయోజనం పొందనున్నారన్నారు. యువతీ, యువకులకు చక్కటి విద్యా అవకాశాలు లభించినప్పుడే గిరిజన సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అన్నపూర్ణ, నాయకులు లక్ష్మయ్య, బాలుగౌడ్, రాజు, రవికుమార్, నాయక్, భాస్కర్‌నాయక్, సర్దార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమేశ్

అంతర్జాతీయ క్రీడా పోటీల్లో మూడో స్థానం

హెడ్‌కానిస్టేబుల్ గోపాల కృష్ణయ్యకు బ్రాంజ్ మెడల్



జాతీయ జెండాతో గోపాలకృష్ణయ్య

వికారాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని అలబామా స్టేట్ బర్మింగ్ హామ్‌లో జూన్ 27 నుంచి జరుగుతున్న వరల్డ్ పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్-2025 పోటీల్లో భారత్ తరఫున పాల్గొన్న సైబరాబాద్ కమిషనరేట్‌కు చెందిన హెడ్‌కానిస్టేబుల్ వికారాబాద్ రామయ్యగూడకు చెందిన గోపాల కృష్ణయ్య ప్రత్యేక ఘనత సాధించారు. తైక్వాండో రికగ్నైజ్డ్ పూంసే 40 విభాగంలో ఆయన బ్రాంజ్ మెడల్ సాధించగా, ఫ్రీస్టైల్ పూంసే విభాగంలో కూడా మరో బ్రాంజ్‌ను సొంతం చేసుకున్నారు. గతంలోనూ గోపాల కృష్ణయ్య విశేష ప్రతిభ కనబర్చారు. వరల్డ్ పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్ 2022, రోటర్డామ్(నెదర్లాండ్స్)లో క్యూర్గి-40 అండర్ 80 కేజీల విభాగంలో బ్రాంజ్ మెడల్, 2024 ఓపెన్ ఏషియన్ పోలీస్ తైక్వాండో చాంపియన్‌షిప్, వియత్నాంలో 35పై వయస్సు గల వారి విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించారు. జాతీయ స్థాయిలో కూడా గోపాల కృష్ణయ్య 1 గోల్డ్, 3 సిల్వర్, 2 బ్రాంజ్ మెడల్స్‌తో పోలీస్ క్రీడల్లో తన క్రీడా నైపుణ్యాన్ని నిరూపించుకుంటున్నారు. ఇది పోలీస్ శాఖకు గర్వకారణమని సైబరాబాద్ అధికారులు తెలిపారు.



సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన అభ్యర్థులు

టీజీఈఏపీసెట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

వికారాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): టీజీఈఏపీసెట్ -2025 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన మంగళవారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభమైంది. తొలిరోజు 194 మంది అభ్యర్థులు స్లాట్ నమోదు చేసుకోగా, వారిలో 183 మంది హాజరయ్యారు. ముఖ్య పరిశీలనాధికారి పి.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పరిశీలనాధికారులు వీవీ రామలక్ష్మి, కె.సుధీంద్రకుమార్, పి.కిరణ్‌గౌడ్ సర్టిఫికెట్లను పరిశీలించారు. కార్యక్రమంలో సిస్టమ్ అడ్మిన్ ఎం.జీవంకుమార్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది పి.చంద్రారెడ్డి, ఎంఏ ఖదీర్, మౌనిక తదితరులు పాల్గొన్నారు. మొదటి రోజు అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రశాంతంగా కొనసాగిందని కళాశాల ప్రిన్సిపాల్ కె.రవీందర్ తెలిపారు.

వంతెన నిర్మాణానికి సహకరించాలి



బాధితులతో మాట్లాడుతున్న ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, జూలై1(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ పట్టణ కేంద్రంలో నిర్మిస్తున్న రైల్వే వంతెన నిర్మాణానికి అందరూ సహకరించాలని కీసర ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి కోరారు. రైల్వే వంతెన నిర్మాణంలో ఇళ్లు కోల్పోతున్న 11 మంది బాధితులు కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. మంగళవారం ఘట్‌కేసర్ తహసీల్దార్ కార్యాలయంలో ఆ 11 మంది బాధితులతో ఆర్డీవో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ చట్టం ప్రకారం ఇళ్లు కోల్పోతున్న వారికి టీడీఆర్ ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్, టీపీవోను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ డీఎస్ రజిని, మున్సిపల్ కమిషనర్ రాజేశ్, టీపీవో రాజీవ్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దారు భాస్కర్‌రెడ్డి, రాజేందర్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని తదితరులు పాల్గొన్నారు.



చౌడాపూర్‌లో కురుస్తున్న వర్షం



వికారాబాద్ పట్టణంలోని రైతు బజారులోకి భారీగా చేరిన వర్షపు నీరు

దంచికొట్టిన వాన


ఉమ్మడి జిల్లాలో భారీ వర్షం

వికారాబాద్ రైతు బజార్‌లో అవస్థలు

విద్యుత్ సరఫరాలో అంతరాయం

వికారాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మంగళవారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. సాయంత్రం ప్రారంభమైన వర్షం రాత్రి వరకూ కొనసాగింది. కురిసిన వర్షానికి వాగులు, వంకల్లో వరద నీరు ఉధృతంగా ప్రవహించింది, వికారాబాద్ జిల్లా కేంద్రంలో రైతుబజార్‌లోని వరద నీరు భారీగా చేరడంతో రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉమ్మడి జిల్లా పరిధిలో అత్యధికంగా ఇబ్రహీంపట్నంలోని మంగల్‌పల్లిలో 45.8 మి.మీ. వర్షం కురిసింది. కొంగరకలాన్ కలెక్టరేట్ వద్ద 42.8, వర్షపాతం నమోదు కాగా, శంషాబాద్‌లోని పెద్దషాపూర్‌లో

మిగతా 5వ పేజీలో...



నిరుపయోగంగా బస్టాండ్

● యాలల ప్రాంగణంలోకి రాని బస్సులు
● రోడ్డుపైనే ప్రయాణికులు, విద్యార్థుల నిరీక్షణ


వినియోగంలో లేక పొదలతో నిండిన యాలాల బస్టాండ్

యాలాల, జూలై1(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్టాండ్ నిరుపయోగంగా మారింది. ఇందుకు ప్రధాన కారణం బస్సులు బస్టాండ్‌లోకి రాకవడమే! ప్రయాణికులు, విద్యార్థులు బస్సుల కోసం రోడ్డుపైనే వేచి ఉంటున్నారు. డ్రైవర్లు, కండక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారం వ్యవహరిస్తూ బస్సులను నడుపుతున్నారని ప్రజలు అంటున్నారు. యాలాలలో 1989లో గోరెపల్లికి చెందిన రవీందర్‌గౌడ్ బస్టాండ్‌కోసం రెండెకరాల పొలాన్ని విరాళంగా ఇచ్చారు. ఆ స్థలంలో బస్టాండ్ నిర్మించారు. కొత్తలో బస్సులు లోపలికి వెళ్లేవి. అయితే రెండేళ్లుగా బస్సులు బస్టాండ్‌లోకి అసలే రావడం లేదు. ప్రయాణికులు రోడ్డుపై బస్సు ఎక్కడం, దిగడం చేస్తున్నారు. ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. యాలాలకు పనుల నిమిత్తం తాండూరు నుంచి, గ్రామాల నుంచి ప్రజలు వచ్చి పోతుంటారు. ఉన్నత పాఠశాల విద్యార్థులు గ్రామాల నుంచి వస్తుంటారు. వీరంతా బస్సుల కోసం వేచి చూస్తుంటారు. ఎండ, వానల్లో రోడ్డు పక్కనే నిల్చుంటున్నారు. డిపో అధికారులు స్పందించి బస్సులు బస్టాండ్‌లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రజలు దేశీయ వస్తువులనే వినియోగించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న స్వదేశీ జాగరణ మంచ్ రాష్ట్ర కో-కన్వీనర్ ఈశ్వర్

చేవెళ్ల, జులై 1 (ఆంధ్రజ్యోతి): దేశీయంగా తయారైన వస్తువులనే ఉపయోగించాలని స్వదేశీ జాగరణ మంచ్ రాష్ట్ర కో-కన్వీనర్ ఈశ్వర్ తెలిపారు. చేవెళ్లలోని చైతన్య కళాశాలలో మంగళవారం స్వదేశీ జాగరణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ.. దేశం మరో స్వదేశీ ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్వదేశీ వస్తువులను వాడితే వాటి ద్వారా దేశ ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. స్థానికంగా తయారయ్యే వస్తువులకు డిమాండ్ పెరిగితే అభివృద్ధి దిశగా పయనిస్తామని వివరించారు. ఉదయం లేచింది మొదలు రాత్రి వరకు విదేశీ వస్తువులను వాడుతుండడం వల్లే ఆర్థికవ్యవస్థ కుదేలవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాలమూరు విభాగ్ కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్ తదితరులు ఉన్నారు.


5 నుంచి కంటి వైద్యశిబిరం

● టాస్క్ సీవోవో రాఘవేందర్‌రెడ్డి



ఆమనగల్లు, జూలై 1(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి నియోజకవర్గంలో అంధత్వ నివారణ కార్యక్రమాన్ని ఉద్యమ స్ఫూర్తితో ముందుకు తీసుకుపోతున్నామని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. ఆమనగల్లులోని ఫౌండేషన్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. ఈ నెల 5నుంచి 13 వరకు కల్వకుర్తి సీకేఆర్ ఫంక్షన్ హాల్‌లో కంటి వైద్యశిబిరం నిర్వహిస్తామని తెలిపారు. చెన్నై శంకరన్ నేత్రాలయ సహకారంతో శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. కంటి పరీక్షలు నిర్వహించి దృష్టిలోపం ఉన్న వారికి ఐవోఎల్ ఆపరేషన్లు, లెన్స్, ఉచితంగా అద్దాలు అందజేస్తామని వివరించారు.

రూ.కోటితో ఎల్లమ్మ ఆలయాభివృద్ధికి కృషి


ఆలయంలో హోమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మాజీ మంత్రి అరవింద లింబావళి

తాండూరు రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ-కర్ణాటక సరిహద్దుల్లోని కొత్లాపూర్ రేణుక ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి దేవాదాయ శాఖ ద్వారా రూ.1కోటి నిధులు మంజూరు చేయిస్తానని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. కేరళ వేదపండితులతో మూడు రోజులు కొనసాగిన మృత్యుంజయ హోమం మంగళవారంతో ముగిసింది. హోమంలో కర్ణాటక విద్యాశాఖ మాజీ మంత్రి అరవింద లింబావళితో ఎమ్మెల్యే పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. ఈ ఎల్లమ్మ ఆలయం పురాతన కాలం నాటిదని, మహిమ గల తల్లి అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖలతో మాట్లాడి రూ.కోటి నిధులు మంజూరు చేయించి కల్యాణ మండపం, భక్తులకు వసతి గదులు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు కల్పిస్తామన్నారు. నెలరోజులు జరిగే జాతరలో తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రల భక్తులు అమ్మ వారిని దర్శించుకున్నారన్నారు.

వేద పండితులతో ఆలయ శుద్ధి

కొత్లాపూర్ రేణుక ఎల్లమ్మ తమ ఇంటి దేవత అని కర్ణాటక మాజీ మంత్రి అరవింద లింబావళి చెప్పారు. 15సంవత్సరాల క్రితం ఆలయాన్ని పునర్నిర్మించామని, అయితే నిర్వహణ లోపం కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీంతో కేరళ వేద పండితుల ద్వారా ఆలయాన్ని శుద్ధి చేయించామన్నారు. దేశంలోని వివిధ 30 ఆలయాల్లో నిర్వహించిన కుంకుమార్చనలతో తెచ్చిన ద్రవ్యాలతో ఇక్కడ మూడు రోజులపాటు మృత్యుంజయ హోమాన్ని క్రైముక్ నారాయణ నంబూద్రి ఆధ్వర్యంలో నిర్వహించారని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో కర్ణాటకలోని మహదేవపురం ఎమ్మెల్యేగా నాలుగు సార్లు గెలిచానని, ఆ రాష్ట్ర మంత్రిగానూ పనిచేశానని ఆయన వివరించారు. రూ.కోటితో ఆలయంలో పెయింటింగ్, గ్రానైట్స్ వంటి పనులు చేయించామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నవీన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్, నాయకులు సాయిలు, వడ్డె శ్రీనివాస్, పండరి, రాందాస్, గోపాల్, రాంచంద్రారెడ్డి, ప్రదీప్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బైండ్ల రాజు, లల్యానాయక్, లాలయ్యగౌడ్ శ్రీధర్‌గౌడ్, ఉదయభాస్కర్‌రెడ్డి, ఆలయ ప్రతినిధులు రవి, శ్రీనివాస్ పూజారి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల వివరాల సేకరణ



వివరాలు సేకరిస్తున్న రజనీకాంత్

కడ్తాల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): విద్య శాఖ, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో యంగ్ ఎర్త్ లీడర్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీజీఆర్ సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ రజనీకాంత్ తెలిపారు. వైఈఎల్‌పీలో భాగంగా పాఠశాలల్లో సర్వే నిర్వహించి వివరాలను సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. కడ్తాల జెడ్పీ బాలుర పాఠశాలలో మంగళవారం హెచ్‌ఎం జంగయ్య, విద్యార్థులు, టీచర్లతో పాఠశాల వివరాల నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. పాఠశాలలో వాటర్ హార్వెస్టింగ్ పిట్, కంపోస్ట్ పిట్, నో ప్లాస్టిక్ జోన్, కిచెన్ గార్డెన్, సీడ్ మ్యూజియం, ప్రిపరేషన్ ఆఫ్ విలేజ్ జియోగ్రఫీ మ్యాప్స్, ప్లాంటేషన్ వంటి వాటిపై కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు రాష్ట్రంలో సీజీఆర్ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో టీచర్లు భాగ్యలక్ష్మి భీముడు, శోభారాణి, కౌసల్య, విద్యార్థులు సుష్మంత్, ముజీద్, ఆదిత్య, ప్రసాద్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

అనురాగ్ అధ్యాపకురాలికి డాక్టరేట్


కూటికంటి సంధ్య

ఘట్‌కేసర్ రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): అనురాగ్ యూనివర్సిటీ అధ్యాపకురాలు కూటికంటి సంధ్యకు డాక్టరేట్ లభించింది. పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ నిబంధనల మేరకు 'జీవ సంబంధ నానో పదార్థాలు, సంశ్లేషణ-సూక్ష్మ జీవ నిరోధక అండ్ ఎలెక్ట్రోకెమికల్ అధ్యయనాల్లో ఆమె డాక్టర్ సవితా బెల్వాల్ పర్యవేక్షణలో రీసెర్చ్ పత్రాలు సమర్పించారు. గత నెల 28న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, అగర్తల కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ హెడ్ ఆధ్వర్యంలో వైవా పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. దీంతో అనురాగ్ యూనివర్సిటీ సంధ్యకు డాక్టరేట్ ప్రదానం చేసి సత్కరించింది. ఈ మేరకు యూనివర్సిటీ సీఈవో సూర్యదేవర నీలిమ, హెచ్‌వోడీలు, అధ్యాపకులు ఆమెను అభినందించారు.

కెమికల్ ఫ్యాక్టరీలో ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలి

వికారాబాద్, జూలై 1(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి కెమికల్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో పదుల సంఖ్యలో కార్మికులు మరణించడం, అనేక మంది గాయపడిన సంఘటనపై సమగ్ర న్యాయచారణ జరిపించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వై.గీత డిమాండ్ చేశారు. మంగళవారం వికారాబాద్‌లో ఆమె మాట్లాడారు. ఈ సంఘటనకు యాజమాన్యమే బాధ్యత వహించాలని, రక్షణ చర్యలు చేపట్టక పోవడం, కార్మిక శాఖ పర్యవేక్షణ లేకపోవడం వల్లే ప్రమాదం జరిగిందన్నారు. మరణించిన వారి, క్షతగాత్రుల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించి, ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ముగిసిన ఓరియంటేషన్ కార్యక్రమం


విద్యార్థులతో మాట్లాడుతున్న నిర్వాహకురాలు

శంషాబాద్ రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ హైదరాబాద్ 2025-27 బ్యాచ్ కోసం నిర్వహించిన అభ్యుదయ్-2025 మేనేజ్‌మెంట్ ఓరియంటేషన్ మంగళవారం ముగిసింది. జూన్ 18న దీనిని ప్రారంభించారు. విద్యార్థులకువారి విద్యా, వృత్తిపరమైన వృద్ధికి ఆచరణాత్మక, సాంకేతిక అంశాలను వివరించారు. కార్యక్రమంలో టీసీఎస్ హైదరాబాద్ హెడ్ చల్లా నాగ్, ఎలికో హెల్త్‌కేర్ సర్వీసెస్ లిమిటెడ్ వైస్‌చైర్‌పర్సన్, ఎండీ డాక్టర్ వనిత, స్మార్ట్ ఫార్మా 360 సీఈవో, సాకేత, న్యాయవాది మోబాషిర్ సర్వర్, కెనడాలోని డల్హౌసీ వర్సిటీ ప్రొఫెసర్ స్టీఫెన్ మెచౌలన్, కాలిబర్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ రాజేశ్ మీనన్, గౌహతిలోని టెక్నాలజీ ఇన్నోవేషన్ అండ్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ సీనియర్ ఫెలో పార్థా ప్రతిమ్‌దాస్ గుప్తా, డాక్టర్ గౌతమ్ సిన్హా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్‌హెచ్‌పీఎస్ అవిర్భావ దినోత్సవం


ఎల్‌హెచ్‌పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న రాజు

కేశంపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): లంబాడా హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీ ఎస్) 29వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం మండలాధ్యక్షుడు రాజునాయక్ నేతృత్వంలో నిర్వహించారు. ఎల్‌హెచ్‌పీఎస్ జెండాను ఆవిష్కరించారు. 'మా తండాలో మా రాజ్యం' నినాదంతో 28ఏళ్లుగా లంబాడాల సమస్యలపై పోరాటం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో షాద్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, నంది గామ మండలాధ్యక్షుడు రాము, చందర్, మోహన్, అయోధ్య శ్రీనివాస్, పరశురాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

సాగు పెరిగితే ఆయిల్‌పామ్ మార్కెట్

● జిల్లా వ్యవసాయాధికారి నరసింహారావు


వేములనర్వలో అయిల్ పామ్ తోటను పరిశీలిస్తున్న డీఏవో నరసింహారావు, డీఎస్‌హెచ్‌వో సురేష్ తదితరులు

కేశంపేట, జూలై1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అత్యధికంగా కేశంపేట మండలంలో ఆయిల్ పామ్ సాగవుతుందని, సాగు విస్తీర్ణం పెరిగితే మండలంలోనే ఆయిల్ పామ్ మార్కెట్ పెట్టే చాన్స్ ఉందని జిల్లా వ్యవసాయాధికారి(డీఏవో) నరసింహా రావు అన్నారు. మంగళవారం డీఏవో, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సురేష్‌తో కలిసి ఆయిల్ పామ్‌లో అంతర పంటల సాగుపై కేశంపేట మండలంలో రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. వేములనర్వలో క్షేత్రస్థాయిలో ఆయిల్ పామ్ తోటలను పరిశీలించారు. ఎకరానికి రూ.4,200 ఖాతాలో జమ అవుతున్నాయా.. లేదా? అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆయిల్‌పామ్ తోటలో అంతరపంటలుగా వేరు శనగ, మొక్కజొన్న సాగు చేస్తున్నట్లు రైతులు తెలిపారు. యాసంగిలో సబ్సిడీపై మొక్కజొన్న, వేరశనగ విత్తనాలు అందించేందుకు ప్రభుత్వం యోచిస్తోందని తెలిపారు. అనంతరం మండల పరిధి అల్వాల రైతు వేదికలో రైతులకు ఉచితంగా కంది విత్తనాలను పంపిణీ చేశారు. కేశంపేట మండలానికి 14 క్వింటాళ్ల కంది విత్తనాలు వచ్చాయని తెలిపారు. అంతకుముందు రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తంలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో వ్యవసాయశాఖ కమిషనరేట్ ఏడీ ఇంతియాజ్, ఏవో శిరీష, షాద్‌నగర్ ఉద్యానవన శాఖ అధికారి హిమబిందు, ఏఈవోలు వినయ్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



బహుమతులను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకుడు వెంకట్‌రెడ్డి

షాబాద్, జూలై 1(ఆంధ్రజ్యోతి):క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎలుగంటి వెంకట్‌రెడ్డి అన్నారు. ఏఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా షాబాద్‌లోని పీఆర్ఆర్ మినీ స్టేడియంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన వారికి మంగళవారం బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఏఎంఆర్ ట్రస్ట్ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, అశోక్, సర్దార్‌నగర్ ఏఎంసీ డైరెక్టర్ సంజీవరెడ్డి, నాయకులు దండు రాహుల్‌గుప్తా, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు
ఘనంగా నిర్వహించాలి



జెండా గద్దె నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కడ్తాల్, జూలై 1(ఆంధ్రజ్యోతి):ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని, ఈ నెల 7న అన్ని గ్రామాల్లో సమితి జెండాలను ఎగరవేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ మాదిగ తెలిపారు. కడ్తాల మండలం సాలార్‌పూర్‌లో మంగళవారం వేడుకల సన్నాహక సమావేశం నిర్వహించారు. మండలాధ్యక్షుడు రమేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి కృష్ణ హాజరయ్యారు. ఎమ్మార్పీఎస్ జెండాగద్దె నిర్మాణానికి నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. మాదిగల ఆత్మగౌరవానికి ఎమ్మార్పీఎస్ జెండా ప్రతీక అన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధించిన మంద కృష్ణ మాదిగ చరిత్రలో నిలిచిపోతారని అన్నారు. కార్యక్రమంలో సమితి గ్రామ కమిటీ అధ్యక్షుడు రమేశ్, అంజయ్య, సిలారి, శ్రీను, మధు, రాజేశ్, శర్మ, శ్రీశైలం, రవి, లింగం, చెన్నయ్య పాల్గొన్నారు.

అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసిన
తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

బొంరాస్‌పేట్, జూలై 1(ఆంధ్రజ్యోతి): పరిగి మండలం రంగంపల్లిలో ఎకరా ప్రభుత్వ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసి, అదే గ్రామంలో 20-23ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమార్కులకు కట్టబెట్టడం, గోవిందాపూర్‌లో 16ఎకరాల సీలింగ్ భూమిని అక్రమ రిజిస్ట్రేషన్ చేయడం, మట్టి వ్యాపారులతో కుమ్మక్కయి మట్టి వ్యాపారం చేస్తున్న పరిగి తహసీల్దార్ ఆనంద్‌రావును సస్పెండ్ చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వారు మంగళవారం బొంరాస్‌పేట్ తహసీల్దార్ పద్మావతికి వినతి పత్రం అందించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొత్తూర్ చంద్రయ్యలు మాట్లాడుతూ.. అవినీతి, అక్రమాలకు పాల్పడిన తహసీల్దార్‌ను డిస్మిస్ చేయాలన్నారు. ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.


మొక్కలు నాటి పరిరక్షించాలి



పోతారంలో మొక్కలు నాటుతున్న మున్సిపల్ అధికారులు

మూడుచింతలపల్లి, జూలై1(ఆంధ్రజ్యోతి):ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషిచేయాలని మూడుచింతలపల్లి మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్ తెలిపారు. మంగళవారం మూడుచింతపల్లి మున్సిపాలిటీ పరిధి నాగిశెట్టిపల్లి, పోతారంలలో మొక్కలు నాటారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. మునిసిపాలిటీలో వంద రోజుల ప్రణాళికలో భాగంగా మొక్కలు నాటి సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. మొక్కలు నాటగానే సరిపోదని, సంరక్షించినప్పుడే మన కార్యక్రమానికి సార్థకత చేకూరుతుందన్నారు. అనంతరం నాగిశెట్టిపల్లిలో తడి, పొడి చెత్త నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు రామేశ్వరరావు, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మునిసిపల్ కమిషనర్



కీసర, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మాల్కాజ్‌గిరి కలెక్టర్ మను చౌదరిని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా వెంకట్‌రెడ్డి మేడ్చల్ కలెక్టరేట్‌లో కలెక్టర్ మను చౌదరిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అదే విధంగా అదనపు కలెక్టర్ రాధికగుప్తాను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

మద్యం విక్రయాల నిషేధంపై నోటీసులు

కులకచర్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల మండలంలోని బండవెల్కిచర్లలో మద్యం విక్రయాల నిషేధంపై గ్రామస్తులు, యువకులు మంగళవారం తీర్మాన నోటీసులను బెల్టు షాపుల నిర్వాహకులకు, కిరాణా దుకాణాల యజమానులకు అందజేశారు. 'మనం బాగుండాలి. అందులో మనం ఉండాలి. మన గ్రామం ముందుండాలి' అనే నినాదంతో ముందుకు వెళ్తున్నామని యువకులు తెలిపారు. గ్రామంలో మద్యం విక్రయిస్తే రూ.1 లక్ష జరిమానా తప్పదని, విక్రయిస్తున్న వారిని పట్టిస్తే రూ.25వేలు అందిస్తామని ఈ సందర్భంగా గ్రామస్తులు, యువకులు తెలిపారు.



గ్రామంలో షాపు యజమానికి నోటీసు ఇస్తున్న యువకులు

'డబుల్' ఇళ్ల సమస్యలు పరిష్కరిస్తాం



సమావేశంలో డ్రగ్స్ నిర్మూలనపై మాట్లాడుతున్న శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్

శంకర్‌పల్లి, జూలై 1(ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ యోగేశ్ తెలిపారు. శంకర్‌పల్లిలోని డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల వద్ద ఆయన సీఐ శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి మంగళవారం లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరుచేసి చెత్తబండ్లలో వేయాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సీఐ మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ చేయూతనందించాలని కోరారు. మాదక ద్రవ్యాల నిషేధంపై అవగాహన కల్పించి వారిచే ఆయన ప్రతిజ్ఞ చేయించారు. జీహెచ్ఎంసీ టూబీహెచ్‌కే ఏఈ రామకృష్ణ, మున్సిపల్ మేనేజర్ అంజన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

8లోగా రైతు రిజిస్ట్రీ చేయించుకోవాలి



యాచారం రైతు వేదికలో రైతు రిజిస్ట్రీ కోసం వచ్చిన రైతులు

యాచారం, జూలై1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు రిజిస్ట్రీని(రైతు ఐడీ) చేయించుకోవాలని. ఈ నెల 8వ తేదీ వరకు చేయించుకోవాలని యాచారం ఏవో రవినాథ్ తెలిపారు. రైతులు ఆధార్, ఫోన్ నంబర్లతో రైతు వేదికలో నమోదు చేసుకోవాలని కోరారు. రైతు రిజిస్ట్రీతోనే వ్యవసాయ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. సర్వే నంబర్ల వారీగా ఏ పంటలు వేశారో నమోదు చేసుకోవాలన్నారు. యాచారం, మేడిపల్లి గున్‌గల్, మాల్ క్లస్టర్ గ్రామాల రైతులు ఏఈవోల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు.

విరిగిన విద్యుత్ స్తంభంతో..
పొంచి ఉన్న ముప్పు

- ఎన్ఎఫ్‌సీ నగర్‌లో ప్రమాదకరంగా ఎలక్ట్రిక్ పోల్
- పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు

ఘట్‌కేసర్, జూలై 1(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభం విరిగి ఎప్పుడు కిందపడుతుందోనని స్థానికులు జంకుతున్నారు. విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఘట్‌కేసర్ పరిధి ఎన్ఎఫ్‌సీ నగర్ కాలనీలోని బి-2లో విద్యుత్ స్తంభం పైన విరిగింది. రాకపోకలు సాగించే రోడ్డు కావడంతో ఎప్పుడేప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయపడుతూ ప్రయాణం సాగిస్తున్నారు. ఆరు నెలలుగా విద్యుత్ అధికారులకు తెలియజేస్తున్నా కొత్త స్తంభాన్ని పాతడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. బలమైన గాలులు వీస్తే పోల్ విరిగిపడుతుందని, ప్రమాదం జరిగితేనే అధికారులు స్పందిస్తారా? అని ప్రశ్నిస్తున్నారు. నిత్యం షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు కాలిపోతున్నాయన్నారు. అస్తవ్యస్త విద్యుత్ లైన్లను సరిచేయాలని విన్నవిస్తున్నా పట్టించుకునే నాధుడులేడని అంటున్నారు. మూడు రోజుల క్రితం హైవోల్టేజీతో ఫ్రిడ్జిలు, ఫ్యాన్లు, ఏసీలు, కూలర్లు, గ్రైండర్లు వంటి గృహోపకరణాలు కాలిపోయాయని తెలిపారు. ఇప్పటికైనా కొత్త స్తంభాన్ని పాతించి, నిత్యం ఏర్పడుతున్న షార్ట్ సర్క్యూట్ సమస్యను కూడా పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



విరిగిన విద్యుత్ స్తంభం ఇదే

నిత్యం భయపడుతున్నాం



ఎన్ఎఫ్‌సీనగర్ కాలనీ బి-2లో స్తంభం పైభాగం విరిగింది. ఎప్పుడు కిందపడి ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతన్నాం. ఈ సమస్యపై విద్యుత్ అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదు. ముప్పువాటిల్లక ముందే వారు స్పందించాలి.
-శోభారాణి, మాజీ ఉపసర్పంచ్, ఎన్ఎఫ్‌సీనగర్

మరమ్మతులు చేయిస్తాం



ఎన్ఎఫ్‌సీనగర్‌లో విరిగిన విద్యుత్ స్తంభాన్ని మేం పరిశీలించాం. దానికి తొలగించి కొత్త స్తభాన్ని పాతేందుకు చర్యలు తీసుకుంటాం. ఈ విషయాన్ని కాంట్రాక్టర్‌కు తెలియజేశాం. నిత్యం ఏదో చోట మరమ్మతులు జరుగుతున్నందున అలస్యమైంది. త్వరలో సమస్యను పరిష్కారిస్తాం.
- యశ్వంత్, ట్రాన్స్‌కో ఏఈ, ఘట్‌కేసర్

ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి
దరఖాస్తుల ఆహ్వానం



బషీరాబాద్, జూలై 1(ఆంధ్రజ్యోతి): బషీరాబాద్‌లోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో బోధించేందుకు ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అనీల మంగళవారం తెలిపారు. పాఠశాలలోని కార్యాలయంలో విలేకరులతో ఆమె మట్లాడుతూ.. టీజీటీ-తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం, సోషల్, ఫిజికల్ సైన్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల ఫ్యాకల్టీ పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు. ఆయా సబ్జెక్టుల్లో బీఈడీ/టెట్ అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 4తేదీ లోపు ఆఫీసులో దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

ఎమ్మెల్యేలపై 'స్థానిక' భారం

- పార్టీ అభ్యర్థుల గెలుపు వారికి పరీక్ష
- తలనొప్పిగా మారనున్న బీసీ రిజర్వేషన్ల అమలు
- స్తబ్దుగా ప్రతిపక్ష పార్టీలు



తాండూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఏడు ఏనిమిది నెలలుగా ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల హడావిడి రాజకీయ పార్టీల్లో మొదలైంది. కాంగ్రెస్ పార్టీ మాత్రం ఎన్నికల్లో అభ్యర్థులను గెలిపించుకునే బాధ్యతను ఎమ్మెల్యేలకు అప్పగించింది. అభ్యర్థులను గెలిపించుకొని ఎంపీపీలు, జెడ్పీ స్థానాలను చేజిక్కించుకుంటే వచ్చే సాధారణ ఎన్నికల్లో ఎమ్మెల్యేల గెలుపునకు ఎంతో ఉపయోగం అనే భావనలో పార్టీ రాష్ట్ర నేతలు ఉన్నారు. దీంతో స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకునే బాధ్యతను సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌లు ఎమ్మెల్యేలకు అప్పగించారు. మూడు నెలల్లో ఎన్నికలు పూర్తిచేయాలని హైకోర్టు సైతం రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో పాలక పార్టీ ఎమ్మెల్యేలు ఇప్పటి నుంచే వ్యూహాలు రచిస్తున్నారు. ఆయా చోట్ల బలమైన వ్యక్తి ఎవరు? రిజర్వేషన్ ప్రకారం ఎవరిని నిలబెట్టాలి? ప్రత్యర్థి పార్టీల బలాబలాలేమిటి? అనే అంశాలపై ఆరా తీస్తున్నారు. పార్టీ గుర్తుతో ఎన్నికలు నిర్వహించే ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలను అత్యధికంగా గెలిచి ఎంపీపీలు, జెడ్పీ స్థానాలను కైవశం చేసుకోవాలని జిల్లా ఎమ్మెల్యేలు ఇప్పటి నుంచే కార్యరంగంలోకి దిగుతున్నారు. ఇప్పటికే కార్యకర్తలు, స్థానిక నాయకులతో మండలాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నారు. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి తన నియోజకవర్గంలో అన్ని ఎంపీపీలు, జెడ్పీటీసీ స్థానాల గెలుపునకు గట్టి అభ్యర్థుల వేటలో ఉన్నారు. కాగా కొత్తగా తెరపైకి వచ్చిన బీసీలకు 42శాతం సీట్లు కేటాయింపు అంశం పార్టీకి తలనొప్పిగా మారే అవకాశాలున్నాయి. బీసీ రిజర్వేషన్ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందితే మెజారిటీ సీట్లు బీసీలకు దక్కుతాయి. ఆమోదం పొందకున్నా మొత్తం స్థానాల్లో పార్టీ పరంగా అయినా బీసీలకు 42శాతం టికెట్లు ఇవ్వాలని కాంగ్రెస్ యోచిస్తున్నట్లు సమాచారం. అయితే బీసీలకు కేటాయించిన స్థానాల్లో ఓసీ అభ్యర్థులు నిలబడినా తట్టుకొని గెలిపించుకునేలా అభ్యర్థులను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ఈ విషయంలో పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు ఇప్పటి నుంచే కసరత్తు చేపట్టారు. ఇదిలా ఉంటే ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు స్థానిక సంస్థలకు ఇంకా సన్నద్ధం కావడంలేదనే చెప్పాలి. ఎన్నికలను ఎదుర్కొనేందుకు ప్రణాళిక రూపొందించడంలో ఆ పార్టీలు వెనుకబడ్డాయి. అధికార కాంగ్రెస్ చేపడుతున్నంతగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించడం లేదు. తాండూరు నియోజకవర్గంలో పెద్దేముల్, యలాల, తాండూరు, బషీరాబాద్ మండలాల్లో 53 ఎంపీటీసీ, నాలుగు జెడ్పీటీసీ స్థానాలున్నాయి. అధికారులు ఎన్నికల ప్రక్రియకు సన్నద్ధమవుతున్న పరిస్థితులు కన్పిస్తున్నాయి.

ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటుతాం



కలెక్టరేట్ ఆవరణలో మొక్కలు నాటుతున్న జిల్లా లీడ్ బ్యాంక్ అధికారులు, సిబ్బంది

మేడ్చల్, జూలై1(ఆంధ్రజ్యోతి ప్రతినిధి):వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో దాదాపు 500 మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సి.శివప్రసాద్ తెలిపారు. మంగళవారం కెనరా బ్యాంక్ 120వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్ ఆవరణలో శివప్రసాద్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. డీఎస్‌డీవో వినోద్‌కుమార్, డీఆర్‌డీఏ సూపరింటెండెంట్ పారిజాతం, జేడీఎం దివాకర్, డీపీఎంలు, రెవెన్యూ ఉద్యోగి టి.సంతోష్ కుమార్, స్పోర్ట్స్ ఆఫీస్ సిబ్బంది పాల్గొని వివిధ రకాల పండ్ల మొక్కలను నాటారు.

'కుల వృత్తిని కాపాడుకుంటాం'

వికారాబాద్, జూలై 1(ఆంధ్రజ్యోతి): తమ కుల వృత్తిని కాపాడుకుంటామని, అవసరమైతే కోర్టుకు వెళ్తామని ప్రొఫెసర్ నాగయ్య అన్నారు. వికారాబాద్ కలెక్టరేట్‌లో మంగళవారం నాయీబ్రాహ్మణులతో కలిసి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాం కాలంలో మంగలి, చాకలి, వడ్ల, కమ్మరి, కంచరి, ఊరడితో పాటు మొత్తం 12కుల వృత్తుల వారికి ఇనామ్‌లు ఇచ్చారని తెలిపారు. ఇవన్నీ ప్రజలకు సేవ చేసే కులాలని పేర్కొన్నారు. ఈ కులాలు వృత్తి ధర్మాన్ని చాటేవారని అన్నారు. కుల వృత్తుల వారి ఆవశ్యకతపై, వారు ప్రజలకు చేస్తున్న సేవలపై నాడే ప్రముఖ కవి దాశరథి రంగాచార్యులు ఎంతో గొప్పగా చెప్పారని గుర్తుచేశారు. నాయీ బ్రాహ్మణులకు ఐదు వృత్తులు ఉన్నాయని, ఇప్పుడు తమ వృత్తిలోకి వేరే వారు చొరబడుతూ ఉపాధిని లాగేస్తున్నారన్నారు. ఇప్పుడు తామేం చేయాలని ప్రశ్నించారు. ఇతర కులస్తులు సెలూన్లు నిర్వహించడంపై కోర్టుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో పట్టణ నాయీ బ్రాహ్మణులు పాల్గొన్నారు.

పాలకులు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి



కందుకూరులో కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన మాటను పాలకులు నిలబెట్టుకొని నెరవేర్చాలని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగలేదని సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమలుచేయకపోవడం సరికాదని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. వివిధ గ్రామాల లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంగళవారం మండల పరిషత్‌లో అందజేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకం కింద మొదట రూ.51వేలు, అనంతరం దానికి రూ.లక్ష ఒక్క వెయ్యికి పెంచారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ మొస్తే లక్ష నగదు, తులం బంగారం ఇస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు ప్రకటించారని, దానిని నేటికీ అమలుచేయకపోవడం అన్యాయమన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే 31మందికి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కృష్ణానాయక్, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్, డైరక్టర్లు ఆనంద్, శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ కె.గోపాల్, డీటీ శేఖర్, ఆర్ఐలు యాదగిరి, శ్రీకాంత్, నాయకులు సురేందర్‌రెడ్డి, జి.లక్ష్మీనర్సింహారెడ్డి, జయేందర్, ఎస్.రాజశేఖర్‌రెడ్డి, లచ్చ్యానాయక్, మేఘనాథ్‌రెడ్డి, కె.రామక్రిష్టారెడ్డి, వై.శ్రీనివాస్, కె.సదానంద్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, చంద్రశేఖర్, భూపాల్‌రెడ్డి, జంగయ్య, బాబు, ఇందిరదేవేందర్, సురేష్, కె.రాములు, ప్రకాశ్‌రెడ్డి, దేవీలాల్, కార్తీక్, దీక్షత్‌రెడ్డి, సామయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల
ఏర్పాటు అభినందనీయం



ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సందర్శించిన నర్సిరెడ్డి

మంచాల, జూలై1(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో తెలంగాణ పబ్లిక్‌స్కూల్స్ ఏర్పాటు అభినందనీయమని మాజీ ఎమ్మెల్సీ అలుగుపల్లి నర్సిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తెలంగాణ పబ్లిక్ స్కూల్(టీపీఎస్‌వీ) బృందంతో కలిసి మండలంలోని ఆరుట్ల పాఠశాలను సందర్శించారు. ఇక్కడ పాఠశాలలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజల మధ్య అంతరాలను తొలగించేందుకు విద్య దోహదపడుతుందన్నారు. రాష్ట్రంలో మొదటిసారి ఆరుట్లలో పబ్లిక్‌స్కూల్ ఏర్పాటు సంతోషకరమన్నారు. తన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ పౌరస్పందన వేదిక సమాజంలో మంచిని పెంచేందుకు కృషిచేస్తోందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం గిరిధర్‌గౌడ్, సుప్రియ, మోహన్‌గౌడ్, పేరెంట్స్ కమిటీ సభ్యులు కె.భాస్కర్, నూకం రాజు, జానీపాషా, జంగయ్య, మల్లేశ్, పార్వతి, జ్యోతి, టీచర్లు పాపిరెడ్డి, కిషన్‌చౌహాన్, శ్రీకాంత్, జహీర్ ఉన్నారు.

గిర్మాపూర్‌నకు బస్సు సర్వీసు ప్రారంభం

పెద్దేముల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): గిర్మాపూర్ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గిర్మాపూర్ గ్రామం కొన్నేళ్లుగా ఆర్టీసీ బస్సు సౌకర్యానికి నోచుకోలేదు. గతంలో ఒకసారి బస్సు వేసి 15రోజులు సర్వీసును కొనసాగించారు. ఆతరువాత రద్దు చేశారు. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని రోజులుగా గ్రామస్తులు, నాయకులు గిర్మాపూర్ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని కోరారు. ఎమ్మెల్యే స్పందించి మంగళవారం నుంచి గ్రామానికి బస్సు సర్వీసు వేయించారు. తాండూరు నుంచి గౌతాపూర్, చెంగోల్‌మీదుగా గిర్మాపూర్ చేరుకుని తిరిగి అదే రూటులో తాండూరు వెళ్తుంది. గ్రామానికి వచ్చిన బస్సుకు గ్రామస్తులు కొబ్బరికాయలు కొట్టి స్వాగతం పలికారు. సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



కొబ్బరికాయ కొట్టి బస్సుకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

దంచికొట్టిన వాన

(3వ పేజీ తరువాయి)

42.5మి.మీ. వర్షం కురిసింది. మామిడిపల్లిలో 40.8, ఎయిర్‌పోర్ట్ వద్ద 38.5, రాచలూరులో 37.5, ధారూరులో 36.3, కోట్‌పల్లిలో 35.8, వికారాబాద్‌లో 35.3, పరిగిలో 33.8, ఎలిమినేడులో 33.3, దోమలో 33.0 మి.మీ వర్షం కురిసింది. అమీర్‌పేట్‌లో 33.0, పెద్ద ఉమ్మెంతాల్‌లో 31.3, మాంఖాల్ ఇండస్ట్రియల్ ఏరియాలో 31.0, నందిగామలో 30.8, దండు మైలారంలో 30.8, మహేశ్వరంలో 30.5 మి.మీ. వర్షం కురిసింది. ఇదిలా ఉంటే, గత కొన్ని రోజులుగా వర్షాలు కురియక అన్నదాతలు దిగాలుగా ఉన్న విషయం విదితమే. విత్తనాలు విత్తుకున్న రైతులు వరుణుడి కరుణ కోసం ఎదురు చూస్తున్నారు. విత్తనాలు విత్తుకున్న తర్వాత వర్షం కురియక కొందరు.. వర్షం లేక కొత్తగా రైతులు విత్తనాలు విత్తుకోలేక ఆవేదన చెందుతున్న విషయం తెలిసిందే. వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతులు మంగళవారం కురిసిన వర్షంతో కొంత ఊరట చెందారు.

రెండు గంటల పాటు...

యాచారం/చౌదరిగూడ: యాచారం మండలంలోని యాచారం, నందివనపర్తి, కుర్మిద్ద, చౌదర్‌పల్లి, గున్‌గల్, మాల్ గ్రామాల్లో కుంభవృష్టి కురిసింది. మంగళవారం రాత్రి ఏడున్నర గంటలకు వర్షం మొదలై రెండున్నర గంటలపాటు వర్షం కురిసింది. ఈ వానాకాలంలో ఇదే భారీ వర్షం. వర్షంతో సాగర్-హైదరాబాద్ రహదారిపై పలుచోట్ల వాహనాలు నిలిచిపోయాయి. యాచారం పెట్రో మొబైల్ 1, 2 పోలీసులు వాహనాల డ్రైవర్లను సూచనలు చేశారు. యాచారంలో రోడ్డుపై వరద నిలిచింది. నందివనపర్తి వెళ్లేదారిలో భారీ గుంతలుండడంతో ఆటో డ్రైవర్లు ఇబ్బందులు పడ్డారు. నజ్దిక్‌సింగారంలో అలుగు వద్ద వరద నీరు నిలిచింది. మాల్‌లో సాగర్-హైదరాబాద్ రహదారిపై వాహనదారులు అవస్థలు పడ్డారు. జిల్లేడ్ చౌదరిగూడ, కొందుర్గు మండలాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లపై వరద నీరు చేరడంతో ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



వికారాబాద్‌లో కురుస్తున్న వర్షం

రైతు బజారులో అవస్థలు

వికారాబాద్/ధారూరు/బొంరాస్‌పేట్/చౌడాపూర్: వికారాబాద్ జిల్లాలోని వికారాబాద్, ధారూరు, బొంరాస్‌పేట్, చౌడాపూర్ మండలాల్లో వర్షం కురిసింది. ఈ వర్షంతో పంటలకు ప్రాణమొచ్చినట్లు అయిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వికారాబాద్‌లో భారీ వర్షానికి రైతుబజార్ అస్తవ్యస్తంగా మారింది. దీంతో కూరగాయలు అమ్ముకునే రైతులు, వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. కూరగాయలు నీటిలో కొట్టుకుపోయాయి. ఇక్కడ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కోసం గతంలో పనులు చేపట్టిన పనులు మధ్యలోనే ఆగిపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు మార్కెట్ పనులు ప్రారంభమయ్యేలా చూడాలని కోరుతున్నారు.

ధారూరులో విద్యుత్ సరఫరా బంద్

ధారూరు మండలంలో మంగళవారం తెల్లవారుజాము వరకు కుండపోత వర్షం కురిసింది. ఈ వర్షం పంటలకు మేలు చేకూర్చింది. వర్షం ప్రారంభమైన వెంటనే ధారూరు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వర్షం పడితే గంటల తరబడి కరెంట్ కట్ అవుతోందని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం రాత్రి కురిసిన వానకు తాండూరు నుంచి సబ్‌స్టేషన్‌కు సరఫరా నిలిచి మంగళవారం ఉదయం వరకు రాలేదు. ట్రాన్స్‌కో సిబ్బంది మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునురుద్ధరించారు. వికారాబాద్ నుంచి ప్రత్యామ్నాయ లైన్ ఏర్పాటు చేయాలంటున్నారు.

సాయం అందేనా?

(మూడో పేజీ తరువాయి)

ప్రకటించి ఆ తర్వాత వాయిదా వేసింది. ఎంపికైన లబ్ధిదారుల జాబితాను ఇన్‌చార్జి మంత్రి అప్రూవల్ కోసం పంపించారు.

నిరుద్యోగుల్లో అసంతృప్తి

కాగా ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రారంభించిన రాజీవ్ యువ వికాసం పథకంపై నిరుద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఊరించి ఉసూరుమనిపిచ్చినట్లు ఆర్థిసాయం అందించకుండా తాత్సారం చేయడంపై వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 2న రుణ పత్రాలు పంపిణీ చేస్తారని తెలిపి చివరకు వాయిదా వేశారని , మళ్లీ దాని ఊసే లేకపోవడం పట్ల నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి లబ్ధిదారులకు సాయం అందించాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

రైతులకు కంది విత్తనాల పంపిణీ

దౌల్తాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): దేవరఫస్లాబాద్ గ్రామంలోని రైతు వేదికలో రైతులకు మంగళవారం ఏవో లావణ్య ఉచిత కంది విత్తనాలు పంపిణీ చేవారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాములు, ఏఈవోలు నిఖిల్ పాల్గొన్నారు.

సొంతింటి కల మరింత దూరం!

- సిండికేట్‌గా మేస్త్రీలు
- ఇళ్ల నిర్మాణానికి 2.50 లక్షలు అయితే రూ.3.50 లక్షల వరకు డిమాండ్


గోరిగడ్డ తండాలో ముగ్గు పోసిన ప్రజాప్రతినిధులు(ఫైల్)

కులకచర్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఐదు లక్షల ఇందిరమ్మ ఇళ్ల పథకం కలగానే మిగులుతోంది. ఇల్లు కట్టుకునేందుకు వస్తున్న మేస్త్రీలు సిండికేట్‌గా మారడంతో లబ్ధిదారులపై అధిక భారం పడుతున్నది. కులకచర్ల మండలానికి మొదటి విడతలో 291 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ఇప్పటికీ పలువురు లబ్ధిదారులను గుర్తించి మంజూరు పత్రాలను అందజేశారు. అందులో పలువురు ముగ్గు కూడా వేశారు. కానీ ఇక్కడే సమస్య మొదలైంది. ఇల్లు కట్టుకునేందుకు వస్తున్న మేస్త్రీలు సిండికేట్‌గా మారడంతో ఒక ఇందిరమ్మ ఇల్లు కట్టేందుకు రూ.3లక్షల నుంచి రూ.3.50 లక్షల వరకు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. వాస్తవానికి ఇంటి నిర్మాణానికి రూ.2లక్షల నుంచి రూ.2లక్షల 50 వేల వరకు మేస్త్రీల కూలీ అవుతుందని పలువురు మేస్త్రీలు చెబుతున్నారు. కానీ మేస్త్రీలందరూ సిండికేట్‌గా మారడంతో ఎక్కువ మొత్తంలో అడుగుతున్నట్లు లబ్ధిదారులు వాపోతున్నారు. ఇదే అదనుగా ఐరన్, సిమెంట్ వ్యాపారులు కూడా సిండికేట్ అయ్యే దిశగా చర్చలు జరుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇలా అయితే ప్రభుత్వం ఇచ్చే మొత్తం మేస్త్రీలకే సరిపోతుందని పేదవాడు అదనపు మొత్తాన్ని భరించే పరిస్థితి ఉండదు. దీంతో ఇప్పటికే పలువురు ముగ్గు వేసినప్పటికీ పనులు మాత్రం ప్రారంభం కావడం లేదు. ఇలా అయితే డబ్బులు ఉన్న వారు తప్ప పేదలు ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించే పరిస్థితి ఉండదు. దీంతో పాటు ఒక్కో మేస్త్రీ నుంచి 10ఇళ్ల ఒప్పుకుంటున్నారు. ఇలా అయితే ఏకకాలంలో ఇల్లు పూర్తి చేయడమూ కష్టమనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపించి సమస్యకు పరిష్కారం చూపాలని పలువురు లబ్ధిదారులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

బైక్‌పై నుంచి పడి యువకుడి మృతి


రాములు మృతదేహం

బషీరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై నుంచి పడి ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన బషీరాబాద్ మండలం ఇందర్‌చెడ్ రోడ్డు మార్గంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శంకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బషీరాబాద్‌లోని జయంతి కాలనీకి చెందిన బయలుపాటి రాములు(25) తన తాత సంకుల బోనప్పతో కలిసి బైక్‌పై నవాంద్గీ పెద్దచెరువుకు చేపలు పట్టేందుకు వెళ్లాడు. సాయంత్రం 4గంటలకు బైక్‌పై ఇరువురు తిరిగి వస్తుండగా చెరువు కట్ట సమీపంలోని రోడ్డు మలుపు వద్ద బైక్ అదుపుతప్పి పొలం గుంతలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో రాములు తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున తాత సంకుల బోనప్పకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్‌ఐ ఘటనాస్థలానికి చేరుకుని విచారణ జరిపారు. బోనప్ప పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..

దౌల్తాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోకఫస్లాబాద్ గ్రామానికి చెందిన కోనేటి దామోదర్‌రెడ్డి(42) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఎస్‌ఐ రవిగౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోనేటి దామోదర్‌రెడ్డి సోమవారం రాత్రి మద్యం సేవించి తన స్నేహితుడు జాకీర్ అలీ ఇంట్లో నిద్రించాడు. మరుసటి రోజు మంగళవారం ఉదయం 6గంటలకు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. దామోదర్‌రెడ్డి ఒంటిపై గాయాలుండటంతో మృతుడి భార్య ప్రభావతి పోలీసులకు పిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్ట్


గంజాయి తరలిస్తూ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడిన నిందితులు

మేడ్చల్ టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను మేడ్చల్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. మేడ్చల్ ఎక్సైజ్ సీఐ నవనీత తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మేడ్చల్ చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ పోలీసులు రూట్‌వాచ్ నిర్వహిస్తుండగా రెండు బైక్‌లపై మేడ్చల్ వైపు వస్తున్న మహేశ్‌బాబు, నరేందర్, క్రిస్టో పి.ఫిలిప్స్, షాజీల వద్ద నుంచి 475గ్రాముల గంజాయి, 255గ్రాములు హాష్ ఆయిల్ లభించింది. దీంతో నలుగురిని అదుపులో తీసుకుని విచారించగా వారు మేడ్చల్ పారిశ్రామిక వాడలోని కార్మికులకు, కళాశాలల్లో చదివే విద్యార్థులకు మత్తుపదార్థాలు విక్రయించడానికి మత్తుపదార్థాలు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

దాడి ఘటనలో ఏడుగురి రిమాండ్


మాట్లాడుతున్న సీఐ శ్రీధర్‌రెడ్డి

దౌల్తాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండివాడ తండా, హన్మానాయక్ తండాల పొలాలకు వెళ్లే బాట విషయంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఇరువర్గాల దాడి సంఘటనలో బండివాడ తండాకు చెందిన చౌహాన్ వెంకట్‌నాయక్ మృతి చెందాడు. ఈ సంఘటనపై పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దాడికి పాల్పడిన నిందితులు హన్మానాయక్ తండాకు చెందిన ధనావత్ జైపాల్ నాయక్, ధనావత్ రాములునాయక్, ధనావత్ మాన్యానాయక్, ధనావత్ విజయ్‌నాయక్, ధనావత్ వెంకట్‌నాయక్, ధనావత్ రవినాయక్, అమ్రీబాయిలను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

చోరీకి పాల్పడుతున్న దొంగలకు దేహశుద్ధి

- పోలీసులకు అప్పగింత

కీసర, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పట్టపగలు వ్యవసాయ పొలంలో చోరీకి పాల్పడుతున్న వ్యక్తులను రైతులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన మంగళవారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధి కీసర దాయరలో జరిగింది. కీసర దాయర గ్రామానికి చెందిన నక్క రాములు వ్యవసాయ పొలంలోని ఓ గది నుంచి గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు బోరు మోటార్లు, విద్యుత్ తీగలు ఎత్తుకెళ్తుండటం గమనించిన సమీప రైతులు దొంగలను పట్టుకున్నారు. వారికి దేహశుద్ధి చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ మేరకు రైతుల పిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్వచ్ఛమేవ జయతే!

(మూడో పేజీ తరువాయి)

పరిశీలించి వారి అభిప్రాయాలను సేకరిస్తారు. పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించిన తర్వాత స్వచ్ఛ సర్వేక్షణ్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో వివరాలను నమోదు చేయనున్నారు.

ఏఏ అంశాలు పరిశీలిస్తారంటే...

ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రతీ ఇంట్లో మరుగుదొడ్డి నిర్మించుకున్నారా ? నిర్మించుకున్న మరుగుదొడ్డి వినియోగిస్తున్నారా? ఇంకుడు గుంత ఉందా? చెత్త నిర్వహణ సక్రమంగా చేస్తున్నారా? మురుగు కాలువలు క్రమం తప్పకుండా శుభ్రం చేస్తున్నారా? ఇళ్ల నుంచి చెత్త సేకరణ ఎలా కొనసాగుతోంది? తడి, పొడి చెత్త సేకరణ వేర్వేరుగా జరుగుతోందా? సేకరించిన చెత్తను డంప్ యార్డుకు తరలించి సేంద్రియ ఎరువుగా మారుస్తున్నారా? అనేది పరిశీలించనున్నారు. అలాగే ప్రజలకు సురక్షిత తాగునీటి నీరు సక్రమంగా సరఫరా చేస్తున్నారా? పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, పంచాయతీ కార్యాలయంలో మరుగుదొడ్ల నిర్వహణ, ఇంకుడు గుంతలను పరిశీలిస్తారు. కిచెన్ గార్డెన్ల నిర్వహణ ఎలా ఉందనేది చూడనున్నారు. పారిశుధ్య కార్యక్రమాలకు వినియోగించే ట్రాక్టర్ల నిర్వహణ తీరుతెన్నులు పరిశీలిస్తారు. ప్రజల నుంచి సేకరించిన సమాచారాన్ని పూర్తి స్థాయిలో పరిశీలించి వివరాలను నివేదిక రూపంలో కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించిన అంశాల ఆధారంగా కేటాయించిన మార్కుల ఆధారంగా పంచాయతీలకు ర్యాంకులు, పురస్కారాలను ప్రకటించనున్నారు. జిల్లాలో సర్వే బృందాలు పర్యటించనున్న నేపథ్యంలో గ్రామాల్లో స్వచ్ఛ వాతావరణం కనిపించేలా పంచాయతీ కార్యదర్శులకు అధికారులు ఇప్పటికే అవగాహన కల్పించారు. పారిశుధ్యం పనులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవోలు పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు.


టేకులపల్లిలో మురుగు కాలువ శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

బీసీలను విస్మరించిన బీజేపీ


రాజ్‌కుమార్

తాండూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిని బీసీ సామాజిక వర్గానికి కేటాయించకుండా ఇతరులకు కేటాయించడం బీసీలను విస్మరించడమేనని జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్‌కుమార్ వెల్లడించారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కావడానికి ముగ్గురు బీసీ ఎంపీలు, బీసీ ఎమ్మెల్యేలు, బీసీ సీనియర్ నాయకులు ఉన్నప్పటికీ అవకాశం కల్పించలేదని విమర్శించారు. చివరి క్షణంలో బీసీలకు మొండిచెయ్యి చూపించారని, పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌కు రాష్ట్ర అధ్యక్షుడిగా అవకాశం ఇస్తే తెలంగాణలో బీజేపీ బలపడేదని అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే రాజాసింగ్‌కు అధ్యక్ష పదవి కోసం నామినేషన్‌కు అనుమతించకపోవడం దుర్మార్గమైన చర్య అని అభిప్రాయపడ్డారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కీసర, జూలై1(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి అన్నారు. 100రోజుల ప్రణాళికలో భాగంగా మంగళవారం దమ్మాయిగూడ మున్సిపల్ పరిధి చీర్యాల్‌లో తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగహన కల్పించారు.

సైన్స్ టీచర్ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి

యాలాల, జూలై 1, (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన సైన్స్ టీచర్ సస్పెన్షన్‌ను తక్షణమే ఎత్తివేయాలని తెలంగాణ స్టేట్ మైనార్టీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ వాహబ్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సైన్స్ టీచర్ విద్యార్థులకు బయో సైన్స్ ప్రాక్టికల్‌గా చెప్పే ప్రయత్నంలో జంతువు మెదడు తెచ్చి బోధించడాన్ని జీర్ణించుకోలేక మత ద్వేషాన్ని సృష్టిస్తున్నారని ఆరోపించారు. కలెక్టర్ వెంటనే స్పందించి సైన్స్ టీచర్ ఖాసింబీపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సస్పెన్షన్‌ను ఎత్తివేయకపోతే ప్రజాసంఘాల ఆధ్వర్యంతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఉత్తమ సేవలతో తగిన గుర్తింపు


పాపమ్మను సత్కరిస్తున్న కీసరగుట్ట ఆలయ నిర్వాహకులు

కీసర, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవలతో తగిన గుర్తింపు తప్పక లభిస్తుందని కీసర ఆలయ చైర్మన్ తటాకం నారాయణశర్మ అన్నారు. కొన్నేళ్లు కీసరగుట్ట శ్రీ భవాని శివదుర్గ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వీపర్‌గా విధులు నిర్వహిస్తున్న తంగళ్లపల్లి పాపమ్మ మంగళవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా పాపమ్మ సేవను గుర్తించి ఆలయ నిర్వాహకులు ఆమెకు స్వామివారి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఆమెకు ఫౌండర్ సభ్యులు, అధికారులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, అర్చకులు తోటి ఉద్యోగులు వీడ్కోలు పలికారు.

ఘనంగా డాక్టర్స్ డే


డాక్టర్స్‌డే కార్యక్రమంలో ఆర్‌ఎంపీలు

చౌడాపూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం హమీద్ క్లినిక్‌లో డాక్టర్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు షేక్ హమీద్ మాట్లాడుతూ.. వైద్యులు కనిపించే ప్రత్యక్ష దైవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు సంభవించినా, అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు.

హరిత సందేశమిచ్చిన వనజీవి రామయ్య


మొక్క నాటుతున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

తాండూరు, జూలై 01 (ఆంధ్రజ్యోతి): 3 కోట్ల మొక్కలు నాటి వనజీవి రామయ్య హరిత సందేశాన్నిచ్చారని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కోట్రిక విజయలక్ష్మి అన్నారు. తాండూరు పట్టణం హైదరాబాద్ రోడ్డు మార్గంలోని తెలంగాణ బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం వనజీవి రామయ్య జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త వెంకట్, బస్వరాజ్, పాఠశాల ప్రిన్సిపాల్, అటవీశాఖ అధికారి, విద్యార్థులు పాల్గొన్నారు. వనజీవి రామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సన్న బియ్యం పంపిణీ గడువు పెంపు

కులకచర్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రేషన్‌దుకాణాల్లో మూడు నెలల సన్నబియ్యం పంపిణీ ఈనెల 29 వరకు పొడిగించారు. రేషన్‌దుకాణాల్లో మూడునెలల బియ్యం పంపిణీ సోమవారంతో ముగిసింది. అయితే ప్రభుత్వం వందశాతం పంపిణీ పూర్తి కావాలని మరో 29రోజులు పెంచింది. కులకచర్లలోని రేషన్‌దుకాణాన్ని మంగళవారం మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, సొసైటీ చైర్మన్ మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అంజిలయ్యగౌడ్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, మాజీ ఎంపీటీసీ ఆనంద్, వెంకటేశ్, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

590 బస్తాల ధాన్యాన్ని తిప్పి పంపించారు

- ఎమ్మెల్యేకు కౌలు రైతుల ఫిర్యాదు


గోదాం నుంచి తిప్పి పంపిన పత్రాన్ని ఎమ్మెల్యేకు చూపిస్తున్న కౌలు రైతులు

తాండూరు రూరల్, జూలై 1, (ఆంధ్రజ్యోతి): గౌతాపూర్ గ్రామ శివారులో తాము పండించిన వరి ధాన్యాన్ని డీసీఎంఎస్ అధికారులు కొనుగోలు చేసి 590 బస్తాలను తిప్పి పంపించారని కౌలు రైతులు స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి మంగళవారం ఫిర్యాదు చేశారు. కొత్లాపూర్ నుంచి తాండూరు పట్టణానికి ఎమ్మెల్యే తిరిగి వస్తుండగా వారం రోజుల కిందట డీసీఎంఎస్ అధికారులు 590బస్తాలను తీసుకెళ్లి ధన్నారం రైస్ మిల్లు నుంచి వరి ధాన్యం నాణ్యతలేదని, తిప్పి పంపారని కౌలు రైతు నాగారం రాములుగౌడ్‌తో పాటు రైతులు రైతులు ఎమ్మెల్యేతో వాపోయారు. డీసీసీఎం మార్కెటింగ్ శాఖ ప్రతినిధి మజీద్ రైతుల సమస్యలను పట్టించుకోకపోవడంతోనే రైతులు వరిధాన్యం కొనుగోలు చేయడంలో లేనిపోని కొర్రీలుపెడుతున్నట్లు రైతులు వాపోయారు. స్పందించిన ఎమ్మెల్యే మార్కెటింగ్ శాఖ అధికారులు, రైస్ మిల్లర్లతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా గౌతాపూర్ గ్రామానికి విద్యుత్ సరఫరా సక్రమంగా అందడం లేదని మరికొందరు రైతులు ఎమ్మెల్యే ఎదుట ఏకరువు పెట్టారు. ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసిన వారిలో రైతులు నాగారం రాములుగౌడ్, కాంగ్రెస్ నాయకులు నారాయణరెడ్డి, రాంచంద్రారెడ్డి తదితరులున్నారు.

బీఆర్ఎస్ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు


మల్లేశం జన్మదిన వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు

బంట్వారం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ బంట్వారం మండల అధ్యక్షుడు దుర్గం చెరువు మల్లేశం జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఆధ్వర్యంలో మంగళవారం కేక్ కట్‌చేసి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతకు శుభాకాంక్షలు

నవాబుపేట: మండలంలోని ఏక్‌మామిడికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిట్టెపు మల్లారెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు కేక్‌కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా చేవేళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆయనను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రంగారెడ్డి, మాజీ సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, బలవంత్, ఆనంద్‌రెడ్డి, బాలమ్మ, దేవయ్య, రఫీ, తలారి ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఈవీఎంలను వాడొద్దు


పరిగిలో రాస్తారోకో చేస్తున్న బీఎంపీ కార్యకర్తలు

పరిగి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈవీఎంలను వాడొద్దని బీఎంపీ నాయకులు డిమాండ్ చేశారు. భారత్‌బంద్‌లో భాగంగా మంగళవారం భారత్ ముక్తి మోర్చా ఆధ్వర్యంలో పరిగి బస్టాండ్ దగ్గర రాస్తారోకోను నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎంపీ రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఈవీఎంల వినియోగాన్ని నిలిపివేసి బ్యాలెట్ ఓటింగ్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఓబీసీ, అన్ని కులాల కులగణన చేసి, మండల్ కమిషన్‌ను పూర్తిగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, బహుజనసేన జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలి


నిరసన వ్యక్తం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

యాలాల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పరిగి మండలంలోని రంగంపల్లి లోని ఒక ఎకరా ప్రభుత్వ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన తహసీల్దార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మల్కయ్య మాట్లాడుతూ పరిగి తహసీల్దార్ ఆనంద్‌రావు రంగంపల్లిలో ఎకరా భూమితోపాటు, 20-23 ఎకరాల ప్రభుత్వ భూమిలో అక్రమార్కులకు కట్టబెట్టారని ఆరోపించారు. అదేవిధంగా యాలాల గోవిందాపూర్ గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్-95లో 16 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమిని అక్రమ రిజిస్ట్రేషన్ చేశారని తెలిపారు. అక్రమ మట్టి వ్యాపారులతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు.అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న తహసీల్దార్ ఆనంద్‌రావుపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్, ఎల్లప్ప, ముజీబ్, అంజిలప్ప పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం జిల్లా కన్వీనర్‌గా స్వరూపారాణి


నియమాకపత్రాన్ని అందుకుంటున్న స్వరూపరాణి

పరిగి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ముదిరాజ్ సంఘం జిల్లా కన్వీనర్‌గా స్వరూపరాణి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్‌ముదిరాజ్ మంగళవారం నగరంలోని కార్యాలయంలో నియమాక పత్రాన్ని అందజేశారు.

సీసీఐ కర్మాగారంలో కార్మికులకు సన్మానం


సన్మానిస్తున్న తోటి కార్మికులు

తాండూరు రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కరన్‌కోట్ గ్రామ శివారులోని కేంద్ర ప్రభుత్వ రంగ సీసీఐ కర్మాగారంలో పనిచేస్తున్న ఐదుగురు కార్మికులు పదవీ విరమణ పొందారు. కర్మాగారంలో బస్వరాజ్, సత్యనారాయణ, రాజారాం, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య వివిధ విభాగాల్లో పనిచేస్తూ పదవీ విమరణ పొందారు. వీరిని తోటి కార్మికులు ఘనంగా సన్మానించారు.

పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం మండల చైర్మన్‌గా నరేశ్‌కుమార్


నియామక పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి బుచ్చిరెడ్డి

దోమ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం దోమ మండల చైర్మన్‌గా నరేశ్‌కుమార్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి బుచ్చిరెడ్డి తెలిపారు. మంగళవారం జరిగిన ఎన్నికలో చైర్మన్ ఎన్నికతో పాటు డైరెక్టర్లు గా కాంగ్రెస్ బలపర్చిన నారాయణ, బుగ్యానాయక్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో శివకుమార్‌రెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.

గురుకులాల్లో విద్యార్థులకు భద్రత కరువు

పరిగి/పూడూరు, జూలై 1, (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు భద్రత లేకుండా పోయిందని స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు రాజేశ్ మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 17 నెలల్లో ఎన్నో అనార్థలు జరుగుతున్నాయని తెలిపారు. హన్మకొండ జిల్లా పరకాల మండంలోని మల్లక్కపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని శ్రీవాణి హాస్టల్ బాత్రూం ఎంట్రెన్స్‌లో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన తనను కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా హైదరాబాద్ షేక్‌పేట్ పాఠశాలలో ప్రభాస్ మృతి మరవక ముందే శ్రీవాణి ఆత్మహత్య తీవ్రవేదనకు గురి చేసిందన్నారు. ఉపాధ్యాయులు పిల్లల పట్ల చిన్న చూపుతున్నారని, చులకన భావంతో చూడటం సరికాదని అన్నారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగాస్వేరో నాయకులు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వంపై న్యాయ పోరాటం చేస్తామని అన్నారు.

సంక్షిప్తంగా..

రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి

కొడంగల్: రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి తులసి అన్నారు. చిట్లపల్లి, అంగడిరైచూర్ గ్రామాల్లో రైతులకు మంగళవారం ఫార్మర్ రిజిస్ట్రీపై అవగాహన కల్పించారు. కొడంగల్ మండలంలో మొత్తం 17449 మంది రైతులు ఉండగా ఇప్పటి వరకు కేవలం 5825 మంది మాత్రమే రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నారని తెలిపారు.

బషీరాబాద్: బషీరాబాద్‌లోని రైతువేదికలో నీళ్లపల్లి క్లస్టర్ ఏఈవో ప్రవీణ్ మంగళవారం ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు ప్రక్రియను చేపట్టారు.

9న పంచాయతీ కార్మికుల దేశవ్యాప్త సమ్మె

యాలాల: ఈనెల 9న పంచాయతీ కార్మికుల దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్, యు.బుగ్గప్ప అన్నారు. యాలాల ఎంపీవో యాదయ్యకు మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం పంచాయతీ కార్మికులకు ఎంపీవో యాదయ్య గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు మండల అధ్యక్షుడు ఆరీఫ్, కార్మికులు షబ్బీర్ పాల్గొన్నారు.

విగ్రహ పరిసరాలను శుభ్రం చేయాలి

తాండూరు: ఈనెల 4న దొడ్డి కొమరయ్య వర్ధంతిని పురస్కరించుకొని విగ్రహం వద్ద శుభ్రం చేయించాలని తాండూరు డివిజన్ కురువ సంఘం ప్రతినిధులు మున్సిపల్ అధికారులను కోరారు. మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ నరేందర్‌రెడ్డికి మంగళవారం వినతిపత్రాన్ని సమర్పించారు. తాండూరు డివిజన్ ఉపాధ్యక్షులు పూజారి పాండు, మల్లేశం, గోపాలకృష్ణ, వెంకటయ్య, శివరాజు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను అరెస్ట్ చేయాలి

పరిగి: పుట్టపహాడ్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని ఉద్యకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పరిగిలోని పాలకేంద్రంలో మంగళవారం మాట్లాడారు. పది రోజుల కిందట పుట్టపహాడ్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేస్తే ఇప్పటి వరకు నిధులను పట్టుకోవడంలో పోలీసులు విఫలయ్యారని విమర్శించారు. పోలీసులు స్పందించకుంటే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత

కులకచర్ల: బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత అని ఎస్‌ఐ రమేశ్‌కుమార్ అన్నారు. స్థానిక వివేకానంద స్కూల్ అండ్ కాలేజ్‌లో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు.

ఓటరు నమోదుకు సహకరించాలి

కొడంగల్: 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకునేందుకు రాజకీయ నాయకులు సహకరించాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

ధారూరు: తరిగోపులలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మంగళవారం అధికారులు భూమిపూజ చేశారు. గ్రామానికి 25మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరయ్యాయి. వీరికి ప్రొసీడింగ్‌లు అందజేశారు. ఎంపీడీవో నర్సింహులు, అధ్యక్షుడు గఫార్ పాల్గొన్నారు.